# పగడాల చేరు

సత్యవాడ సోదరీమణులు

కామేశ్వరి మనసంతా ఏదోలా ఉంది. ఏపని మీదకి బుద్ధిపోవడంలేదు. అందుకు కారణం లేకపోలేదు. ఆంటీ ఆంటీ అంటూ తన చుట్టూ తిరిగే కమల బొత్తిగా రావడం మానేయటమే. ఇంతకీ ఆ పిల్లని కళ్ళారా చూసి వారాలు దాటిపోలేదు, నెలలు గడిచిపోలేదు. ఓ రెండు రోజులకే కామేశ్వరి ప్రాణం కొట్టుమిట్టాడుతోంది. 'పాప రాత్రి గుక్కపెట్టి ఏడ్చిందనో, బాబిగాడి ఒళ్ళు వెచ్చగా ఉందనో, తన దగ్గరకి పరుగెత్తుకొచ్చే కమల, మీ చేతి వంట కాలు తింటే మా అమ్మ పెట్టినట్టు ఉంటుంది, మీరు పొరుగున వుండటం ఎంత అదృష్టం' అంటూ మెచ్చుకోలుగా తనని మురిపించే ఆపిల్ల-

''చూడండాంటీ ఉక్కపోతగా వుంది పిల్లల్ని తీసుకొని బీచ్‌కి వెళదామంటే ఆఫీసు వర్కు ఎక్కువగా వుంటోంది అంటారు. పోనీ పిల్లల్ని నిద్రపుచ్చి సరదాగా సెకండ్‌షోకి వెళదామన్నా.. అర్ధరాత్రి వరకు మెలకువగా ఉండటం ఎందుకు? పనులు పాడుచేసుకోవటం ఎందుకు? అని తప్పించుకుంటారు'' అంటూ తన దగ్గర గారాలు పోయి మీరే సర్వస్వం అన్నట్టు తనతో అల్లుకుపోయే కమలని చూడకపోయేసరికి కామేశ్వరికి చిరాగ్గా ఉంది. అలా అని కమలకి ఇంట్లో ఒంటరితనం ఏమీలేదు. పెద్దదిక్కు లేకపోనూ లేదు.

కామేశ్వరి వయస్సుదే అయిన కాత్యాయని కోడల్ని కన్నకూతురిలా చూసుకుంటుంది. మామగారయితే సరేసరి. కొడుకు కోడలు మనమలు అతనికి ప్రాణాధికం. అంతటి వాత్సల్యంగా అత్తమామలున్నా పొరుగింటి పుల్లకూరలా కామేశ్వరి సాహసాన్నే కాంక్షిస్తుంది కమల. అత్తమామలు కాస్త పెద్దరికంతో ఓ మాట అంటే పెళుసుగా జావాబిస్తుంది. ఇంట్లో జరిగే విషయాలు గోరంతలు కొండంతలు చేసుకుని కామేశ్వరితో వెళ్ళబోసుకుంటుంది. తనవాళ్ళని పక్కకి పెట్టి కష్టసుఖాలు పంచుకోవటం కామేశ్వరికి మరీ వేడుకగా ఉంటుంది. ఆ పిల్ల మనస్తత్వాన్ని ఆసరాగా చేసుకొని తన పబ్బం గడుపుకుంటుంది కామేశ్వరి.

ఆమె చెవుల్లో అమృతం చిలకరిస్తూ కమల పిలుపు.. ఒక్క అంగలో వెళ్ళి తలుపు తెరిచింది-

''మిమ్మల్ని చూసి యుగాలు గడిచిపోయినట్టుందాంటి'' కామేశ్వరి భుజాన తల ఆనించి గోముగా అంది.

''అయ్యో! నాతల్లీ, నిన్ను చూడకపోతే నాకూ అలానే ఉందమ్మా. సరేకాని ఈ రెండు రోజులకే ఇంత చిక్కిపోయావ్?'' ఆప్యాయంగా ఒళ్ళంతా నిమురుతూ అంది.

''ఏం చెప్పమంటావ్ ఆంటీ నా అవస్థలు. ఇంటి కోడలంటే ఇంట్లో ఉన్నవాళ్ళకి అన్నీ అమర్చిపెట్టే యంత్రం. అత్తమామల మాటకి కట్టుబడవలసిందే తప్ప, పెదవి కదిపి ఒక్కమాట మాట్లాడినా ఎదురు చెప్పినట్టేనట. ఇదీ ఆయనగారి పద్ధతి. ఇలాగే కాలం నెట్టుకొస్తున్నా, ఏవో రగడలు సృష్టిస్తారు మా అత్తగారు. మొన్న కాస్త ఆలస్యంగా నిద్రలేచానని సనుగుడు మొదలెట్టారత్తయ్య. ఆయన మాత్రం తక్కువ తిన్నారా! 'రాత్రి రెండింటి వరకూ ఆపనికి మాలిన టి.వి. చూస్తూ కూర్చున్నావ్, నేను వద్దన్నా వినిపించుకోకుండా. నీకు ఎనిమిది దాటేవరకు తెల్లవారలేదు. అమ్మ మడికట్టుకుని పూజలో కూర్చుంటే నాన్న.. పాపం చేతులు కాల్చుకోవలసి వచ్చింది' అని క్లాస్ తీసుకున్నారు.

''అవ్వ! మీ ఆయనది మరీ సోద్యం. ఆమాత్రం టి.వి. చూడటం కూడ తప్పే. అయినా అతగాడేం అమర్చిపెట్టాడా? పుట్టింటి నుండి తెచ్చుకొని నీ ముచ్చట తీర్చుకుంటున్నావ్'' చెంపన చేయి వేసుకుంది.

''నా ముఖానికి ముచ్చట కూడానా. పిల్లలు లక్కీ మామయ్య పాలు కలిపి తాగించినంత మాత్రానికే ఇంత ఇదైపోయారు.''

''అసలూ, మీ అత్తగారిని అనాలమ్మా, రోజుకో దేవుడి పేరుమీద మడులు, పూజలు. నువ్వు లేచాకనే అఘోరించచ్చుగా.''

''అయ్యబాబోయ్ ఉన్నమాట అనటమే! యుద్ధభేరి మోగిపోదూ!''

''మోగేదేవిటి? నువ్వే యుద్ధానికి సిద్ధంకావాలి. మెత్తని వాళ్ళను చూస్తే మొత్తబుద్ధి. నువ్విలాగే ఉంటే నెత్తెక్కి తాండవం చేస్తుంది మీఅత్తగారు.''

కామేశ్వరి మాటలు అగ్నిలో ఆజ్యం పోసినట్లె ఆ యింట్లో మరింత అశాంతిని సృష్టించింది కమల. ఇక వాళ్ళ ఉనికినే భరించలేనని, సొంత ఊరికి పంపించేయమని భర్తను పోరసాగింది. కరుణానిధి మనస్సు అల్లకల్లోలమయ్యింది. తను చదువుకునే రోజుల్నించి ఎన్నోకలలు కనేవాడు. తన యిల్లు శాంతి మందిరంలా ఉండాలని, కుటుంబంలో అంతా కలసి మెలసి సహజీవనం చేయాలని. కన్నవాళ్ళని సుఖపెడుతూనే కలతలులేని దాంపత్య జీవనాన్ని కైవశం చేసుకోవాలనుకున్నాడు. పుట్టే పిల్లలకు తల్లిదండ్రులంటే ఎంత ప్రేమ ఉంటుందో, తాతనానమ్మలన్నా అంతటి ఆపేక్ష ఉండేట్టు పెంచాలి. కుటుంబ వ్యవస్థపట్ల అపారమైన మమకారం ఉన్న, కరుణానిధి ఆలోచనలు ఆ మోస్తరుగా సాగేవి. కమల అర్ధాంగిగా అడుగుపెట్టాక తన ఆశలు నెరవేర్చింది అనే అనుకున్నాడు. చిన్న చిన్న పొరపొచ్చాలు చిలికి చిలికి గాలివానగా ఎప్పుడూ పరిణమించలేదు. తన వలపులు పండించడమేకాక ఆశయాలకు అనుగుణంగా నడిచే కమలను ఆరాధనా భావంతోనే చూసేవాడు.

అయితే ఈ పరిస్థితుల్లో తనేం చెయ్యగలడు. ఏం చెయ్యాలి? కమల ఎందుకిలా మారిపోయింది. తల పగిలే ఈ ఆలోచనలు ఎప్పటిలా ఆఫీసులో తనపనిని చేసుకోనివ్వటంలేదు. ఫలితం ప్రతిరోజూ మేనేజర్‌తో చీవాట్లు.

''సారీ కరుణా! నీ స్వవిషయాలలో కల్పించుకుంటున్నాను అనుకోకపోతే..'' కిరణ్మయి మాటకు తలెత్తి చూసాడు. అతని ముఖంలోకి పరిశీలనగా చూస్తూ-

''ఏదో పోగొట్టుకున్నవాడిలా బాధ పడుతున్నావెందుకు? ఎప్పుడూ చిరునవ్వులు చిందించే నీ ముఖంలో ఏదో వ్యాకులత. నాలుగు రోజులుగా అడుగుదామనుకుంటూనే ఏదో సంకోచం'' అంది.

కరుణానిధి పెదవులపై శుష్కహాసం-

''స్నేహితుల మన్నాక ఒకరి జీవితపు లోతుల్లోకి మరొకరు తొంగి చూడటానికి సంకోచించనక్కర లేదు.'' అనేసి తన మనస్సుకు ఆవేదన కలిగిస్తున్న విషయం ఆమె ముందుంచాడు.

ఎంత సున్నిత మనస్కుడు కరుణ. తల్లిదండ్రుల్ని సుఖపెట్టలేక, భార్యమాట కాదనలేక సతమతమైపోతున్నాడు. కమలలా ప్రవర్తించటం ప్రతి ఆడపిల్లకి సహజమైపోయింది. అందుకేగా కుటుంబ వ్యవస్థ ఇలా విచ్చిన్నమైపోతున్నది. అత్తమామలను ఆదరించేకంటే పనివాళ్ళపైన ఆధారపడటంలోనే తృప్తిని పొందుతోంది నేటి యువతి. కాని కమలని చూసినప్పుడు తనకలా అనిపించలేదు. వాళ్ళత్తగారు కాత్యాయనీ కూడా కావాలని జగడాలకు దిగే మనిషికాదు. సజావుగా సాగిపోతున్న కరుణ జీవితంలో ఈ కలతలు ఎలా చోటు చేసుకున్నట్టు?! ఈ కలతలు తను మాయం చేయగలిగితే ఎంత బాగుండును.

''చూశావా కిరణ్మయి! నన్నన్నావు. విషయం వినేసరికి నువ్వు దీర్ఘాలోచనలోకి పడిపోయావు. కిరణ్! అర్థంలేని అంతు దొరకని, ఇలాంటి సమస్యలకు పరిష్కారాలుండవు'' కణతలు నొక్కుకున్నాడు.

''అబ్బబ్బా! ఊరికే మనసు పాడుచేసుకోవటందేనికి? కాలం ఎప్పుడూ సరైన తీర్పే ఇస్తుంది. ఏం జరిగినా నువ్వట్టే వర్రీకాకు. సంసార సాగరంలో ఎన్ని ఆటుపోట్లు ఎదుర్కోవాలి? ఇంత చిన్నదానికే ఇలా అయిపోతే ఎలా! నిశ్చలంగా ఉండు. నావంతు ప్రయత్నం నేను చేస్తానుగా'' మిత్రుని చేతిని ఆత్మీయంగా తన చేతుల్లోకి తీసుకొని అంది. కరుణానిధి మనస్సు కాస్త తేలికపడింది. ఆ సాయంత్రమే అమ్మ అన్నమాట అతడిలో మళ్ళీ అలజడి రేపింది.

''వద్దమ్మా నన్ను ఒంటరివాణ్ణి చేసి మీరు వెళ్ళిపోవద్దు'' పసిపిల్లాడిలా అంటున్న కొడుకుని చూస్తూ నిట్టూర్చింది.

''భార్యా పిల్లలున్న నువ్వు ఒంటరి వాడివెలా అవుతావురా! మేము వెళ్ళిపోతే ఈ ఇంటికొచ్చే లోటేమీ లేదు. అన్నీ తెలిసి అమాయకుడిలా మాట్లాడకు. మీ అమ్మని ఇంకా బాధపెట్టకు. ఈ వయస్సులో దానికి నేనూ, నాకు అది అయి బ్రతకలేకపోము'' నాన్న మాటల్లో నిష్ఠూరం. కరుణానిధికి ఎటూ తోచటంలేదు. అమ్మా నాన్నల ప్రయాణాన్ని ఆపగలిగితే, వాళ్ళ నిర్ణయాన్ని మార్చగలిగితే!

నిర్ణయం వాళ్ళది కాదు. ఇంతకీ కారకురాలు తన ఇల్లాలు. విసురుగా వంటింట్లోకి వెళ్ళాడు. కూనిరాగాలు తీసుకుంటూ కమల ఏదో స్వీట్ తయారుచేస్తోంది. కరుణానిధికి అరికాలు మంట నడినెత్తికెక్కింది.

''ఓసారి ఇలా వస్తావా?'' తీవ్రంగానే పలికింది అతని స్వరం. భర్త ఏం మాట్లాడతాడో తనకు తెలుసు. అన్నింటికీ జవాబులు తన దగ్గర సిద్ధంగానే ఉన్నాయి. దగ్గరగా వెళ్ళి-

''ఏమంటారు?'' తనూ కరుకుగానే అంది.

''చూడు కమల! అమ్మా నాన్న మా ఊరు వెళ్ళిపోతామంటున్నారు.''

''వెళ్ళనివ్వండి.''

''ఎంత తేలికగా అనేశావు నువ్వు. ఒకవైపు నుంచే ఆలోచిస్తున్నావు. పెద్దదిక్కు ఇంట్లో ఉండటంవల్ల మనం ఎంత సుఖపడుతున్నామో అర్థం చేసుకోవే.''

కమల ముఖం చిట్లించింది-

''ఏమిటండి అర్థం చేసుకునేది? అత్తగారు వంటావార్పు చేస్తున్నారంటారు. ఆవిడ మడి, ఆచారం అంటూ వేదించుకు తినకపోతే ఆపని చిటికెలో చేసుకోగలను. ఇక పిల్లల మాటంటారా! వాళ్ళూ ఈమధ్య ఆంటీకి బాగా చేరికయ్యారు. చూస్తున్నారుగా, బాబుని స్కూల్‌కి దిగబెట్టి తీసుకు రావటం మొదలు వాళ్ళ ఆలనా పాలనా అంతా ఆంటీయే. వాళ్ళ పూచీ మనకు లేకుండా పోయింది.''

''అమ్మానాన్న మన పిల్లల్ని చూడమన్నారా? నువ్వే కావాలని పిల్లల్ని, నీ ఆంటీకి దగ్గర చేశావు. ఈ రకంగా అత్తమామల్ని మానసిక హింసకి గురిచేస్తున్నావ్''- భార్యని కొరకొరా చూశాడు.

''ఆహాహా! ఏం చెబుతున్నారండి పిల్లల మీద ఊరికే విసుక్కుంటుంటే ఏతల్లి సహిస్తుంది. నా బాధ చూడలేక పాపం ఆంటీ, వాళ్ళను చేరదీశారు. ఈ తర్క వితర్కాలెందుకుగాని వాళ్ళను వెళ్ళనివ్వండి. నాకు చేదోడు వాదోడుగా ఆంటీ ఉన్నారు.''

భార్యను తన దారికి తెచ్చుకోవటం సాధ్యంకాదు అనుకున్న అతను ''మౌనేన కలహం నాస్తి'' అన్న సూక్తిని అనుసరించాడు.

పరిస్థితి చేజారిపోయిందని తెలుసుకున్న కిరణ్మయి, కమల ఇంత తొందరగా అత్తమామల్ని వెళ్ళగొడుతుందని ఊహించలేదు. ఈరోజుల్లో యువతులంతా సుమారు ఈ మోస్తరు భావాలే కలిగి ఉంటున్నారు. కమల అలాంటిరకం కాదు. ఎవరో పనికట్టుకొని తన మనసులో ఈ విషబీజాలు నాటి వుండాలి. నాలుగు విధాలా నచ్చచెబితే తను దారిలో పడుతుందనుకున్నాను. అంతలోనే ఇంత జరిగిపోయింది అంది బాధాతప్త హృదయంతో దిగులుగా ఉన్న కరుణాకరాన్ని చూస్తూ.



''లేదులే కిరణ్! నువ్వనుకుంటున్నంత తొందరగా కమల మనస్సు మార్చలేవు. అమ్మా నాన్న చేసే ప్రతి పనిలోను ఏదో వంక పెట్టటం, వాళ్లేం మాట్లాడినా పెడర్థాలు వెతకటం.. కావాలనే చేసేది. వాళ్ళు మనస్సు విసిగి వెళ్ళిపోతే, విచ్చలవిడిగా ప్రవర్తించవచ్చని ఈ రభసంతా. అమ్మ కాస్త మడీ ఆచారం అంటుందని, సుచిశుభ్రత లేకపోతే ఎలా? కాస్త పొదుపు పాటించాలమ్మా, ఇలా ఉన్నా ఇట్టే ఎదిగిరారు? పెరిగే ఖర్చులు చూసుకోవాలి అంటూ పెద్దరికంతో కాస్త మందలిస్తుందని అమ్మంటే కమలకి వల్లమాలిన కోపం. నాన్న

## సొంత డైరెక్షన్స్



సంజయ్‌గుప్తా డైరెక్ట్ చేసిన 'జంగ్' చిత్రం షూటింగ్ సమయంలో సంజయ్‌దత్ తన ఇష్టమున్నట్టు మాత్రమే డైరెక్ట్ చేయమని గొడవ పడ్డాడుట. పేరున్న హీరోలతో వచ్చే చిక్కులే ఇవి. డైరెక్టర్ని పక్కకు పెట్టి తాము చెప్పినట్టు షూట్ చేయమని కెమెరామెన్‌కి చెప్పేస్తారు వీరు. సంజయ్‌దత్ అలా అడగడం చూసి జాకీష్రాఫ్ కూడా తను చెప్పినట్టు వినమన్నాట్ట డైరెక్టర్ని. శిల్పాశెట్టి, రవీనా హీరోయిన్స్ ఇందులో. ఎవరిష్టం వచ్చినట్టు వాళ్ళు డైరెక్ట్ చేసేసుకుంటే మరి నేనెందుకు ఏడవను ఇక్కడ అని తల పట్టుక్కూర్చున్నాడట డైరెక్టర్. నా పనీ అంతే అని కూర్చున్నాడట నిర్మాత సతీష్ ఖాండన్.


## టెలీ సీరియల్స్ గిరాకీ

ఛానల్స్ పెరుగుతున్నకొద్దీ డైలీ సీరియల్స్, సీరియల్స్ రాత్రాను ఎక్కువయిపోతున్నాయి. ఎస్.గోపాలరెడ్డి, రాఘవేంద్రరావు, కృష్ణంరాజు, రమాప్రభ, శరత్‌బాబు, మ్యూజిక్ డైరెక్టర్ రాజా, ఎమ్మెస్ రెడ్డి, సుబ్బరామిరెడ్డి మొదలైనవారంతా టీవీ మీడియాలోకి వెళ్తున్నారు.

## తిక్క కుదిరింది

జానీవాకర్ కొడుకు నజీర్ తెల్సుకదా! పాపం ఈమధ్య ప్రేమలోపడి తెగ బాధపడిపోతున్నాడట. అడిగినవారికీ, అడగనివారికీ అందరికీ తన ప్రేమ సంగతి చెప్పేసి 'హమ్మయ్య' అని తేలిగ్గా నవ్వేస్తున్నాడట. సదరు హీరోయిన్ (నాలుగక్షరాల నటి) ఏమిటీ పబ్లిసిటీ అని తెగ తిట్టి వెళ్లిందట. మరి తిక్క కుదిరి ఇక చెప్పడం ఆపాడట ఈ మహానుభావుడు.

- విరాజి




గారు కూడ మనకెందుకు తన ఇష్టం అనేవారుకాదు. మీ అత్తయ్య అన్నవి అక్షర సత్యాలు. నువ్వే ఆలోచించు తల్లీ! ఆ లేడీస్ క్లబ్ మీటింగ్‌లంటూ, స్నేహితులకి ఖరీదైన పార్టీలిస్తూ, ఊరికే ఖర్చు చేయడమెందుకు? ఇంటికి పెద్దవాణ్ణి ఉన్నానుకనుక పిల్లాడి చదువు బాధ్యత పూర్తిగా చూసుకుంటున్నాను. పాపకయితే మీ అత్తయ్యే అమ్మ అయ్యింది. కాస్త యింటిపట్టున ఉండి పిల్లల సంరక్షణ, చదువు చూసుకుంటూ సంసారాన్ని దిద్దుకోవటం నీ కర్తవ్యం! ప్రేమగా లాలనగా హితం చెప్పటానికే ప్రయత్నించేవారు నాన్న. 'మీరేం నాకు జీవిత పాఠాలు నేర్పాలా అని' రుసరుస లాడేది. ఆ పంతంతోనే పిల్లల్ని పక్కింటి ఆవిడకి అప్పగించేసింది. అమ్మ ఏపని చేయబోయినా– 'ఇంటెడు చాకిరీ నేనే చేస్తున్నానంటూ దెప్పి పొడవడానికేగా, మీరేపని వేలేసి ముట్టుకోకండి. గడవదన్న భయం నాకేంలేదు.' చీదరించుకునేది. 'పొమ్మనలేక పొగబెట్టారు' అన్నట్లు కోడలు ఈ మోస్తరుగా ఉంటే ఏ అత్తమామలు ఆ ఇంట్లో ఉండగలరు. తన మాటే నెగ్గింది. నా ఆశయం చచ్చిపోయింది. నా బాధ ఎవరికి అర్థమౌతుంది''– ఉబికి రాబోయే దుఃఖానికి అతి ప్రయత్నంతో ఆనకట్ట వేస్తున్న మిత్రుడ్ని చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది కిరణ్మయికి. సుదీర్ఘమయిన నిట్టూర్పు విడిచి తన అశక్తతను వెలువరించింది. భారమైన హృదయాలతో ఆ మిత్రులు తమ తమ పనులలో లీనం కాకతప్పలేదు.

కమల మనస్సు గాలిలో దూది పింజంలా తేలిపోతోంది. ఇక తను స్వేచ్ఛాజీవి. తనకి స్వేచ్ఛ ప్రసాదించిన ఆంటీ రుణం తను ఎలా తీర్చుకోగలదు. గుర్తుండిపోయే బహుమతి ఎలాగైనా ఆంటీకి తను ఇవ్వాలి. ఇలా ఆలోచిస్తూ పసుపు విఘ్నేశ్వరుని పూజలా! తను తయారు చేసిన స్వీట్స్‌తో పళ్ళెం నింపి పరుగెత్తింది ఆంటీ దగ్గరకి. తన కూతురు ఆంటీ వొళ్ళో పడుకొని రెండు చేతులతో ఆవిడ నగలు లాగుతూ అల్లరి చేస్తోంది. తన కొడుకు మాట చెప్పాలా? అటుకుల బువ్వ పెట్టమని సతాయిస్తూ భుజాలు పట్టుకొని ఊపేస్తున్నాడు. తన పిల్లలకోసమే ఆవిడ జీవితం అన్నట్టు మారాం చేస్తున్న వారిద్దరినీ మరింత గారాం చేస్తోందే తప్ప, ఏమాత్రం విసుగుదల లేదు ఆమెలో. చూస్తుంటే ముచ్చటేసింది తనకి.

''వీళ్ళతో ఎలా వేగుతున్నావాంటీ?'' పాపను చేతులోకి తీసుకొంటూ అంది. బాబు చెయ్యి పుచ్చుకుని దగ్గరగా లాక్కుంటూ ''పెద్దావిడ మామ్మని అల్లరి చెయ్యచ్చా!'' మందలించింది.

''పోనీలే అమ్మా! నాకేమీ చికాకు అనిపించటంలేదు. వీళ్ళ ముద్దు మురిపాలతో ఇట్టే పొద్దుపోతోంది. మీ అత్తమామల పోరు వదిలేసుకున్నావు కనుక పూర్తిగా నేను నీకు సహాయ పడగలను. మీ అంకుల్, కిషోర్‌గారు ఉదయంతోనే ఆఫీసులకంటూ బయలుదేరిపోతారు. ఇంక నాకు పనేముంది. నువ్వూ పిల్లలేకదా నాలోకం.

''మీరు ఇంత తోడుగా ఉండటం మా అదృష్టం. మా పాలిట పీడాపిశాచాల్లా తగులుకున్న మా అత్తమామల పోరు నేనెలా వదిలించుకోగలను. మీరు పుణ్యం కట్టుకున్నారు గనుకనే మా సుఖసంతోషాలు మాకు దక్కాయి'' అంటూ కామేశ్వరి నోటికి స్వీటు అందించింది.

''పిచ్చిపిల్ల! పోనీలే నీ కష్టాలు గట్టెక్కాయి. నాకంతే చాలు. ఏమిటో.. వాళ్ళదే ఇంటి పెత్తనం అన్నట్టు పెద్దరికం చూపిస్తూ నిన్ను సతాయిస్తుంటే ఎంతని సహిస్తావు? ఈ యిల్లు సంసారం నీది. మధ్యలో తగుదునమ్మా అంటూ వాళ్ళెవరట. నీ మొగుడికి తల్లితండ్రులైనంత మాత్రాన నీనెత్తెక్కి కూర్చోవాలా. వొళ్ళు మండే తగిన బుద్ధి చెప్పించి తగిలేశాను. ఇక నువ్వూ నీ మొగుడూ హాయిగా వుండండి. ఏ బెడదా లేకుండా ముద్దు ముచ్చట్లతో మీ ఇష్టం వచ్చినట్లు గడపవలసిన కాలం యిది'' తనేదో ఘనకార్యం చేసినట్టు కమలకి తిరుగులేని ఉపకారం చేసినట్టు పొంగిపోయింది.

● ● ●

''ఏమిటి కామేశ్వరీ! ఇదెలా వచ్చింది. భార్యమెడలో కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న సరికొత్త పగడాల చేరును ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు.''

''అలా ఆశ్చర్యపోతారేం? ఎక్కడా దొంగిలించుకు రాలేదు. మన పెళ్ళయిన దగ్గర్నుండి మొత్తుకుంటున్నాను. నాకు పగడాల దండ ఇష్టం చేయించి పెట్టమని. ముప్ఫైఏళ్ళుగా మీరు తీర్చని ముచ్చట మూడు నెలల్లో నా మనసు తెలుసుకుని మరీ తీర్చింది ఆపిల్ల.'' ఆవిడ కళ్ళు గర్వంతో మెరుస్తున్నాయి.

''ఎవిటి? కరుణానిధి భార్య చేయించిందా?''

''ఏం తప్పా! వాళ్ళమ్మగారి ఊళ్ళో పగడాలు చవకట. వేసుకోండి ఆంటీ మీకెంతో బావుంటుంది అంటూ బంగారపు తీగ చుట్టించి మరీ బహుమతి ఇచ్చింది. మీరు చెయ్యలేని పని ఆ అమ్మాయి చేసిందని ఉడుకుమోత్తనం ఎందుకు?'' అంటూ తన పగడాల దండను అపురూపంగా చూసుకొని వంటింట్లోకి వెళ్ళిపోయింది.

కొత్తనగ అమరిన వేళావిశేషం అత్తగారి హోదా వచ్చేస్తోంది కామేశ్వరికి. కిశోర్ పెళ్ళిగూర్చి తల్లిదండ్రులు ఆలోచించే అవసరంరాలేదు.

'నేను ఓ అమ్మాయిని ప్రేమించాను. పెళ్ళిచేసి పెద్దరికం నిలుపుకోండి' అన్న కొడుకు మాటలు శాసనం లానే తోచాయి శంకరరావుకి. కాపురం చెయ్యవలసింది వాళ్ళు, తమని గౌరవాభిమానాల్తో చూస్తూ ఇంటిపేరు నిలబెడితే చాలదు. అనుకున్నాడు అతను.

''అంతా వీడి ఇష్టమేనా తలిదండ్రుల ఇష్టాఇష్టాలతో పనిలేదా? మనం చచ్చామనుకున్నాడా? ఇంతకీ ఆపిల్ల ఎలాంటిదో కులగోత్రాలు, వంశమర్యాదలు అన్నీ తెలుసుకోకుండా కోడలిని తెచ్చేయడమే. నిలుపుకోడానికి మనకు పెద్దరికం ఉంచాడా'' భార్య పోరుతున్నా పట్టించుకోకుండా కొడుకు పెళ్ళి ఘనంగా జరిపించి కామేశ్వరిని, అత్తగారిని చేశాడు శంకరరావు.

నెలలు గడుస్తున్నా కోడలు కాపురానికి రాకపోవటంతో

చుట్టుపక్కల వాళ్ళందరికి విడ్డూరంగా తోచింది. 'మీ కోడలు ఎప్పుడొస్తుంది. అబ్బాయే వారం వారం వెళ్ళి వచ్చేస్తున్నట్టున్నాడు. అన్నట్టు మీ కోడలు నెలకూడ తప్పిందటగా! ఇక మీరే వెళతారేమో సూడిదలు తీసుకొని. అప్పుడైనా తీసుకొస్తారా. అసలు మా ఎవరికీ చూపించనేలేదు మీ కోడలిని..' ఇలా ఒక్కొక్కరు ఒక్కో మాట అంటుంటే కామేశ్వరికి తల పగిలిపోతోంది. నిజమే వాడిమాట కాదనకుండా పెళ్ళంటూ జరిపించేశాం. నలుగురిలో ఈ తలవంపులు లేకుండా వచ్చి లక్షణంగా కాపురం చేసుకోవచ్చుగా! ఆ పిల్ల బెట్టూ సరే, వీడి గుట్టూసరే. ఇక ఊరుకుంటే లాభంలేదు. అనుకున్న కామేశ్వరి ఆ సాయంత్రం బ్రీఫ్‌కేస్ తీసుకొని బయల్దేరబోతున్న కొడుకుని ఆపింది.

''ఏరా మళ్ళీ వెళుతున్నావా? మొన్ననేగా నాలుగు రోజులు ఉండివచ్చావు.''

''అవునమ్మా ఓ నాలుగు రోజులు సెలవుపెట్టాను. శని ఆదివారాలు కలిసొస్తాయిగా ఓవారం ఉండొస్తాను'' విసురుగా వెనుదిరిగాడు.

''అప్పుడే తల్లిదండ్రులింత చేదయ్యారా! నామాట చెవిని పెట్టకుండా నీ ధోరణి నీదేనా! చూస్తుంటే ఇల్లరికం వెళ్ళేట్టున్నావ్? ఎంత మొత్తుకున్నా నేనొక్కదాన్నే! మీనాన్నకి నీమాటే శిరోధార్యం. నా ఇష్టానుసారం పెళ్ళి చేసుకుంటాను అన్నావు. గంగిరెద్దులా తలూపారు. ఆడదానిలా నువ్వు అత్తింటి కాపురం చేస్తుంటే, అదీ ఆ మహానుభావుడికి సబబుగానే తోస్తోంది. ఇంతకీ నీ భార్యని ఎప్పుడు తీసుకొస్తావురా. మీ కోడలు కాపురానికి రాకుండానే నీళ్ళోసుకుందని ఇరుగుపొరుగులు నా ముఖాన వుమ్మేస్తున్నారు. సిగ్గుతో చివికి చస్తున్నాను.''

కిషోర్ పక్కున నవ్వాడు– ''భలేదానివమ్మా ఈ పనేదో పెళ్ళికాకుండానే జరగలేదుగా! సిగ్గుపడటానికి, తల దించుకోడానికి ఏముంది? తనకి ఇక్కడికి రావటం ఇష్టంలేదని చెప్పింది. తొందరలోనే నాకు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ కూడ వస్తుంది. ఇక ఇద్దరం వేరే ఊళ్ళో కాపురం పెడతాం.''

కామేశ్వరి కాళ్ళకింద భూమి కదులుతున్నట్టు అనిపించింది. తనేదో అగాధంలోకి చొచ్చుకుపోతున్నట్టు, తననెవరో బలవంతంగా పాతాళంలోకి లాగేస్తున్నట్టు అనిపించింది. చటుక్కున చతికిల బడిపోయింది.

''అంటే కిరణ్మయి ఇక్కడికి రాదట్రా.''

''ఆ విషయం నీకు అర్థమయ్యే ఉండాలి. ఊరికే నిన్ను బాధపెట్టడం ఎందుకని నేను వివరంగా చెప్పలేదు.''

''నిజం కామేశ్వరీ! మొదటిరాత్రే కిరణ్మయి మనవాడితో చెప్పిందిట. నేను అత్తమామ దగ్గర అణిగి మణిగి ఉండను అని. అబ్బాయి నాతో వెంటనే చెప్పాడు. నేనూ మనిద్దరి విషయంలో ఓ నిర్ణయం తీసుకున్నాను. అనవసరంగా అబ్బాయి ట్రాన్స్‌ఫర్ చేయించుకోవటం ఎందుకు? ఆ పిల్ల సలక్షణంగా ఇక్కడే కాపురం చేసుకోవచ్చు. స్వంతిల్లు స్వర్గలోకంగా–'' భార్యను కొంటెగా చూస్తూ అన్నాడు శంకరరావు. భర్త మాటలకు రవ్వంత తేరుకుంది కామేశ్వరి.

''నేనూ ఆమాటే అంటున్నాను. నయానా భయానా నచ్చచెప్పి అమ్మాయిని తీసుకొచ్చేద్దాం. నేనేం కోడల్ని రాసి రంపాన పెడతానా! అపురూపంగా చూసుకోనూ.''

''అబ్బే అలా అనికాదు కామీ. ఏ బెడదా లేకుండా వాళ్ళమటుకు వాళ్ళు స్వేచ్ఛగా ఉండొద్దు. అందుకే అంటున్నాను. నా నిర్ణయం అమలు జరిగితే కోడల్ని మనం తీసుకొచ్చేదేవిటి? తను రెక్కలు కట్టుకుని అబ్బాయి ముందు వాలదా! చిలకా గోరింకలా కాపురం చేసుకోరా!'' అర్థం కానట్టు భర్త ముఖంలోకి చూస్తుండిపోయింది.

''పిచ్చికామి తొందరలోనే మనం ఓల్డేజ్ హోమ్‌కి వెళ్ళిపోతున్నాం. వాళ్ళకి సుఖసంతోషాలు ఇవ్వవలసిన బాధ్యత మనదే కదా.'' భర్త మాటలు కామేశ్వరికి కొరడా ఝుళిపింపే అయ్యాయి. మనస్సులో ఏదో కలుక్కుమంది. ''స్వేచ్ఛా సుఖసంతోషాలు ఇంట్లో పెద్దవాళ్ళుంటే ఎక్కణ్ణించి వస్తాయి. అత్తమామల్ని నెత్తిన పెట్టుకొని పూజించక్కర్లేదు..'' ఇలాంటి బోధనలు చేసి, పాలు నీళ్ళా కలిసిపోయిన అత్తాకోడళ్ళ మధ్య కలతలు కల్పించి కాత్యాయినీ, భర్తా ఆ పల్లెటూళ్ళో పడిగాపులు పడేట్టు చేసింది. ఇప్పుడు తను ఎంత క్షోభ పడుతోందో ఆరోజు కాత్యాయనిదీ అదే పరిస్థితి. తనవల్లేనేగా ఎదురైంది.

ఏమాలోచిస్తున్నావమ్మా, ''నాన్నారిమాట నీకు నచ్చినట్టు లేదు.'' ''నచ్చడానికి ఏముంది బాబు. జరగవలసిన యదార్థం కూడ అదేగా. చేసిన పాపం ఊరికే పోదంటారు. కలిసి ఉన్న అత్తాకోడళ్ళని విడదీశాను. ఆ కాత్యాయని ఉసురుపోసుకున్నాను. అందుకేనేమో నా కోడలు నా ఉనికినే సహించలేనంటోంది. కొంతకాలమైనా మురిపం దక్కలేదు నాకు. నేను చేసిన పొరపాటు నాకిప్పుడు అర్థమయ్యింది. పోనీలే నాకు తగిన శాస్తే జరిగింది'' మెడలోని పగడాల దండ బరువుగా అనిపించి తీసి పక్కన పెట్టింది. ''ఈ క్షణమే నేను సిద్ధం. మీరెక్కడికంటే అక్కడికి వెళ్ళిపోదాము.'' అంటున్న ఆమె కళ్ళు ధారాపాతంగా వర్షిస్తున్నాయి.

సుతారంగా తల్లి కళ్ళు తుడుస్తూ–

''నీలో ఈ మార్పేనమ్మా మేమంతా కోరుకున్నది. ఆ కరుణానిధి ఆవేదన మొదటిరోజే కిరణ్మయి నాకు చెప్పింది. నీకు అనుభవంలోకి వస్తే అర్థమౌతుందని తను ఈ నాటకం ఆడిందేతప్ప నీ కోడలు చాల మంచిదమ్మా! ఆప్యాయత, అనురాగం మేళవించిన మానవతా మూర్తి'' అంటున్న కొడుకుతో–

''కమలా అలాంటి పిల్లేరా. ఆ అత్తాకోడళ్ళ మధ్య తలెత్తిన గోరంత సమస్యలను కొండంతలు చేసి కమల మనస్సు విరిచాను. కాత్యాయని, కమల కలిసి ఉండేదాకా, నాకోడలు నట్టింట తిరిగే అర్హత ఉండదురా నాకు'' అంటూ కమల దగ్గరకు పరుగెత్తింది. కమల కూడ తన తప్పిదాన్ని తెలుసుకునేట్టు తన మాటలతో నచ్చచెప్పి ఎప్పటిలా అత్తమామల పట్ల ఆపిల్లకు భక్తిగౌరవాలు కలిగించి తనే వెళ్ళి కాత్యాయని దంపతులను తీసుకొచ్చింది. కామేశ్వరి గుండెనిండా ఊపిరి పీల్చుకుంది. కిరణ్మయి తన పాదాలకు నమస్కరిస్తుంటే వారించింది. ''నువ్వే నాకళ్ళు తెరిపించావుతల్లీ. వయస్సుకి మాత్రమే మాలాంటివాళ్ళు పెద్దలం. మా స్వార్థం కోసం అన్యోన్యంగా ఉన్నవాళ్ళ మధ్య ఆరళ్ళు సృష్టించి, మా స్వార్థాన్ని చూసుకుంటాం. నాలాంటి వాళ్ళ ప్రవృత్తి మారితీరాలి తల్లీ.

చిన్నదానివైనా నీకే నేను చెయ్యెత్తి నమస్కరించాలి'' అత్తగారి నోటికి తన చెయ్యి అడ్డుపెట్టి–

''అంత మాటెందుకు అత్తయ్యా. చెప్పుడు మాటలు వినటం కూడ పొరపాటేగా. కమలతో అదే అన్నాను. అయినా ఇప్పుడంతా సర్దుకుపోయిందిగా. గతం మర్చిపోదాం.''

''అవునమ్మా కిరణ్! కాత్యాయని కమలని చూస్తుంటే ఎంతో తృప్తిగా ఉంది నాకు. నా పొరపాటు దిద్దుకోటానికి నువ్వే కారణం తల్లీ'' అంటూ కోడల్ని అక్కున చేర్చుకొని పగడాల చేరుతో ఆమెను అలంకరించింది కామేశ్వరి.

★

## భయం



రవి భార్యతో, ''డియర్ ఇక్కడ 'వంద సంవత్సరాలు ఎలా బ్రతకాలి' అనే పుస్తకం ఉండాలి ఏదీ?''

''దాన్ని నేనే కాల్చిపారేశాను'' అంది లిల్లీ.

''ఎందుకని?'' అన్నాడు రవి.

''అత్తయ్య ఎక్కడ దాన్ని చూసి చదువుతారేమోనని భయం వేసింది.'' అంది నిదానంగా.

– ఇ.ఎస్. మదన్ (వైజాగ్)

## ప్రార్థిస్తా

''ఓ వ్యక్తి నీదగ్గరకొచ్చి నమ్మకంతో వెయ్యిరూపాయలు ఇచ్చి వెళ్లాడు. తర్వాత అతను చనిపోయాడు. నువ్వేం చేస్తావ్?'' అన్నాడు రవి.

''దేవుడ్ని ప్రార్థిస్తా.'' అన్నాడు రాజా.

''ఎందుకూ? పాపం అతని చిరునామా కోసమా? వాడి ఆత్మ శాంతించడానికా?''

''అంత పెద్దమనసు నాకులేదు.''

''మరి?!''

''తరచూ అలాంటి వాళ్లను నాదగ్గరకు పంపమని.''

## తుపాకీ

కొత్తగా సైన్యంలోకి చేరిన ఓ సిపాయికి తుపాకీ ఇచ్చిన అధికారి–

''ఈ తుపాకీ పోయిందంటే దాని ఖర్చు నీ జీతంలోంచి రాబడతాం. నిన్ను సస్పెండ్ చేస్తాం!''

'ఓహో! అందుకన్నమాట... షిప్ మునిగిపోతుంటే కెప్టెన్ కూడా మునిగిపోతాడు!' మనసులో అనుకున్నాడు సిపాయి.

– తరిగొప్పుల విల్సన్ మూర్తి (హైదరాబాద్)